# జాతీయత, జాతీయవాదం పట్ల భారతపాలకుల ఉన్మాద, ప్రతీఘాతుక అవగాహనా, ఆచరణలు

**గతంలో,** బ్రిటిష్ వలసవాదులు భారత ప్రజలపైన హింసను, చీలికవాద, మోసపూరిత విధానాలను ప్రయోగించి తమ పీడక పాలనను రుద్దారు; నిలబెట్టుకొన్నారు. దీనికి వ్యతిరేకంగా తిరుగుబాటుచేయడం, స్వతంత్రమైన, ప్రజాతంత్ర యుతమైన భారతదేశం కోసం పోరాటం చేయడం ఒక గౌరవప్రద విషయంగా వలస ప్రజలు ఆనాడు భావించారు. ఇది పూర్తిగా సహజమైనది; న్యాయమైనది.

వలసపాలకులు అనేక పాశవిక చట్టాలు చేశారు. ప్రజలను అణచివేయడానికి, తమపాలనను శాశ్వతం చేసుకొనడానికి అన్నిరకాల 'చట్టబద్ధ', చట్టవ్యతిరేక పద్ధతులను యథేచ్ఛగా వుపయోగించారు. వలస పాలనకు వ్యతిరేకంగా వున్న అభిప్రాయాలు, కార్యకలాపాలు అన్నీ చట్ట వ్యతిరేకమనీ, రాజ్య వ్యతిరేకమనీ, జాతీయ వ్యతిరేకంగా వలస పాలకులు ముద్రలు వేశారు. సైన్యం, పోలీసులు, జైళ్లు ఆమాట కొస్తే, నిర్బంధ యంత్రాంగం, పాలనాయంత్రాంగం, వాటి అంగాలు అన్నీ వారి చెప్పుచేతుల్లో వుండేవి. ఈ పద్ధతులకు గురైన వారిలో హింసాపద్ధతులపట్ల, సాయుధవిప్లవం, సంఘటిత పోరాటాలపట్ల విశ్వాసాలున్న వారేకాక అహింసాయుత పద్ధతుల పట్ల, సాత్విక పద్ధతులపట్ల విశ్వాసాలున్న వారు కూడా వున్నారు. భగత్‌సింగ్, ఆయన సహచరులతోపాటు అనేక మంది విప్లవకారులు బూటకపు విచారణల తర్వాతనో లేక అసలు ఎలాంటి విచారణాలేకుండానో వురితీయబడ్డారు. తమ సృజనాత్మక శక్తులను స్వాతంత్ర్యపోరాటం కోసం ఉపయోగించిన రచయితలు, గాయకులు, యితర కళాకారులు సైతం వలసపాలకుల ఆగ్రహం నుండి తప్పించుకోలేకపోయారు.

స్వభావరీత్యానే వలసపాలన పూర్తిగా చట్ట విరుద్ధమైనది; అక్రమమైనది; పీడకమైనది; ప్రజా వ్యతిరేకమైనది. కాని అది తనను తాను చట్టబద్ధ మైనదని ప్రదర్శించుకొన్నది; భారత ప్రయోజనాలకు, భారత ప్రజల ప్రయోజనాలకు రక్షకులుగా ప్రదర్శించుకొన్నారు. వలసపాలకులు, తమను వ్యతిరేకించే భారత ప్రజలను రాజ్య వ్యతిరేకులుగా, జాతీయ వ్యతిరేకులుగా చిత్రించడానికి, శిక్షించడానికి పూనుకొన్నారు. ఐతే దీనికి తలొగ్గడానికి భారతప్రజలు నిరాకరించారు. అలా ముద్రవేయబడడాన్ని గొప్ప గౌరవసూచకంగా భావించేవారు.

1947లో, బ్రిటిష్ వలసవాదులు వదలిన చెప్పుల్లో భారతపాలకులు కాళ్లుదూర్చారు. 1935 బ్రిటిష్ ఇండియా చట్టాన్ని ఆధారం చేసుకొని వారొక రాజ్యాంగాన్ని ఆమోదించారు. నిర్బంధ చట్టాలను అన్నింటినీ – ఒక చర్యను రాజ్యవ్యతిరేకమైనదిగా, జాతీయ వ్యతిరేకమైనదిగా, చట్ట విరుద్ధమైనదిగా ముద్రవేసే అధికారాలతో సహా – పరిపాలన, న్యాయ, నిర్బంధ వ్యవస్థలన్నింటినీ వారసత్వంగా స్వీకరించారు. వ్యక్తులను దేశభద్రతా చట్టంకింద, పిడి చట్టం కింద నిర్బంధించడానికి, యితర ప్రత్యేకచట్టాలకింద నిర్బంధించడానికి, దేశంలోని కొన్ని ప్రాంతాలను, లేదా మొత్తందేశాన్ని ఆంతరంగిక లేదా బాహ్య అత్యవసర పరిస్థితి చీకటిపాలన కిందికి తేవడానికి, ప్రాధమిక హక్కులను రద్దుచేయడానికి, విశాలమైన ప్రాంతాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి అక్కడ సుమారుగా సైనిక, పోలీసు పాలనను అమలు జరపడానికి అధికారాలనిచ్చే నిబంధనలు భారత రాజ్యాంగంలో వున్నాయి. నిజమైన ప్రజాతంత్ర కార్యకలాపాలపైన, ప్రజాపోరాటాలపైన చేసే దాడులలో ఒక భాగంగా సంఘాల, వ్యక్తుల కార్యకలాపాలపైన, ఉద్యమాలపైన నిషేధాలు, ఆంక్షలు, సెక్షన్ 144ను విధించడానికి అనుమతించే చట్టాలున్నాయి. పాలకులు టాడా, పోటా యింకా అనేక కొత్తచట్టాలను తెచ్చారు. ఈ చట్టాలు అన్నిసందర్భాలలోనూ తమ న్యాయమైన , ప్రజాతంత్ర యుతమైన హక్కుల కోసం పోరాటాలకు దిగిన కార్మికులకు, రైతులకు, ఆదివాసీలకు, విద్యార్థి– యువజనులకు, దళితులకు, పీడితజాతులకు, అల్పసంఖ్యాక మతస్తులకు, తెగలకు వ్యతిరేకంగా వుపయోగించబడుతున్నాయని మనప్రజల అనుభవం రుజువుచేస్తున్నది.

వలసవాదులు అధికారంలోవున్న సమయంలో స్వాంతంత్ర్య పోరాటయోధులను రాజ్యవ్యతిరేకులనీ , జాతీయవ్యతిరేకులని చిత్రించిన పాలకుల రాజకీయ, నైతిక అధికారాన్ని ప్రశ్నించడానికి, వలసపాలనే చట్ట విరుద్ధమనీ, అక్రమమైనదనీ, ప్రజావ్యతిరేకమైనదనీ ప్రకటించడానికి భారత ప్రజలకు ఎలాంటి యిబ్బందీ వుండేది కాదు. కాని 1947 తర్వాత నూతన పాలకులను సవాలుచేయడంలో వారు కొంతయిబ్బంది నెదుర్కొంటున్నారు. ఈ పాలకులు, ప్రజాస్వామ్యం, స్వతంత్రపాలన అన్న ముసుగుల్లో దేశప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెట్టే విధానాలను అమలుచేయడమే దీనికి కారణం.

**ఏది నిజమైన అభివృద్ధి?**

అభివృద్ధి విధానం గురించి భారత పాలకవర్గాలు చేస్తున్న ప్రచారం యొక్క ప్రభావంలో వున్న కొందరు, పాలకవర్గాల అభివృద్ధి విధానం యొక్క నిజస్వభావాన్ని లోతుగా పరిశీలించలేకపోతున్నారు. ఈ కారణంగా పాలకవర్గాలను ప్రశ్నించడంలో యిబ్బందిపడుతున్నారు. ఐతే, అభివృద్ధి అన్నపదం యొక్క నిజమైన అర్థంపట్ల నిజంగా ఆసక్తి వున్న వారందరూ అసలు అభివృద్ధి అంటే ఏమిటి? అన్న విషయం గూర్చి మొదట ఆలోచించాలి. భారతపాలకవర్గాల అభివృద్ధి విధానం మన దేశంలో లభించే సహజవనరుల్లపైన, మానవ వనర్లపైన ఆధారపడి, భారతదేశం స్వతంత్రంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యానికి తోడ్పడే విధంగా వుందా? మనప్రజల ఆర్థిక, సాంస్కృతిక స్థాయిని వున్నతస్థాయికి పెంచడానికి, వారిజీవితాలకు, జీవనాధారాలకు విశ్వసనీయ భద్రత సమకూర్చడానికి దోహదపడేవిధంగా వుందా? లేక గుప్పెడుమంది విదేశీ, స్వదేశీ బడాదోపిడీదారులు దేశ సహజవనర్లను, మానవవనర్లను విచ్చలవిడిగా కొల్లగొట్టడానికి, అత్యధిక లాభాలు సంపాదించడానికి, మన వనర్లను నాశనం చేయడానికి, మనదేశాన్ని అంతులేని ఆర్థిక, రాజకీయ పరాధీన స్థితిలోకినెట్టడానికి, అత్యధిక సంఖ్యాక భారత ప్రజలను బయటపడలేనంత లోతైన ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, అభద్రతల్లోకి నెట్టివేయడానికి దోహదపడే విధంగా వుందా? అని ఆలోచించాలి.

ఒక దేశం పొరుగుదేశాలతో సంబంధాలను ఎలా నెరుపుతున్నది? వాటితో సమస్యలను ఎలా పరిష్కరించుకొంటున్నది?- విదేశాంగ విధానంలో ఇది ఒక ముఖ్యాంశం. 1962లో భారత - చైనాయుద్ధం జరిగింది.1965, 1971 సంవత్సరాలలో, భారత- పాకిస్తాన్‌ల మధ్య రెండు యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలు రెండు దేశాలకూ తీవ్రనష్టాలను, గాయాలను తెచ్చిపెట్టాయి. చాలా కాలంపాటు రెండుదేశాల మధ్య ఉద్రిక్తతలు; యుద్ధమూ లేని, శాంతీలేని పరిస్థితులు కొనసాగాయి. రెండు దేశాలూ యుద్ధసన్నద్ధత పేరిట, ఒకరిపైన మరొకరు పైచేయి సాధించాలనే పేరిట ఎడతెగకుండా నూతన, ఆధునిక ఆయుధాలను గుట్టలుగా ప్రోగుచేసుకొన్నాయి. సరిహద్దు పొడవునా సైనిక బలాలనూ, ప్రతినిఘాయంత్రాంగాలనూ మోహరించుకొన్నాయి. రెండు దేశాల ప్రజల విద్వేష పూరిత, పరస్పర అనుమానాలతో కూడిన సంబంధాలను కొనసాగించాయి. ఇవన్నీ ప్రజలపైన మోయలేని ఆర్థిక భారాలను మోపాయి. ఈ పరిస్థితి ఎందుకు కొనసాగుతున్నది? భారత-పాకిస్తాన్‌ల మధ్య ఘర్షణవల్ల ప్రధానంగా ఎవరు లాభపడుతున్నారు? రెండు పక్షాలకూ ఆయుధాలు అమ్ముకొని. అంతులేని లాభాలను ఆర్జిస్తున్నది ఒకే సామ్రాజ్యవాదులన్నది నిజంకాదా? ఆ విధంగా, భారత-పాక్ వివాదంలో సామాజ్యవాదులు స్వార్థప్రయోజనాలేర్పరచుకొన్నారు. రెండుదేశాల పాలకులు భారత-పాక్ వ్యవహారాల్లో ఎందుకిలా సామ్రాజ్యవాదుల జోక్యాన్ని అనుమతి స్తున్నారు? తమసమస్యలను తాము స్వతంత్రంగా, శాంతియుతంగా ఎందుకు పరిష్కరించుకోలేక పోతున్నారు? ఏ పరిస్థితులు, ఏ బలహీనతలు వారిని అడ్డుకొంటున్నాయి? ఈ ప్రశ్నలన్నీ ప్రజలను, ప్రజల ప్రయోజనాలపట్ల నిజమైన ఆసక్తివున్న వారందరినీ, రెండు దేశాల మధ్య శాంతియుతమైన, సోదర పూర్వకమైన సంబంధాలుండాలని ఆకాంక్షించే వారందరినీ వేధిస్తున్నాయి. రెండుదేశాల పాలకవర్గాల తప్పుడు విధానాలకు నిజంగా, దారుణంగా బలవుతున్న రెండుదేశాల ప్రజలు ఈ ప్రశ్నలకు సరైన సమాధానాలు అడగకుండా ఎంత కాలమని నోరు మెదపకుండా వుండగలరు?

మన ప్రజలు యితర దేశాలతో మన సంబంధాలు - సమానత్వం, సౌభ్రాతృత్వం, శాంతి, పరస్పర సహాయం అన్న సూత్రాలపై ఆధారపడి వుండాలని కోరుకుంటున్నారు. పొరుగుదేశాలపట్ల పెద్దన్నగా వ్యవహరించాలనికానీ, సామ్రాజ్యవాదులకు, అగ్ర రాజ్యానికి లొంగి వుండే సంబంధాలు నెరపాలనిగానీ కోరుకోవడంలేదు. దీనికి భిన్నంగా వున్న భారత పాలకుల ప్రవర్తనను విమర్శించడం, సరిదిద్దడం తమ బాధ్యతగా, హక్కుగా భావిస్తున్నారు.

కానీ భారతపాలకవర్గాలు, వారికి ప్రాతినిధ్యం వహించే పార్టీలు, ప్రభుత్వాలు ప్రజల ఈ హక్కును గౌరవించడానికి సిద్ధంగా లేవు. జాతీయ ప్రయోజనం, దేశభక్తి, జాతీయసమగ్రత, యుద్ధం-శాంతి, యితర దేశాలతో సంబంధాలు - విదేశాంగ విధానానికి సంబంధించిన ఈ విషయాలు పూర్తిగా తమకు, తమ పరిధికి మాత్రమే సంబంధించిన విషయాలుగా భావిస్తున్నాయి. పాలకులు అనుసరించే విధానాలలో ఏవి సరైనవి, ఏవికావు అన్న విషయాలపైన తీర్పులు ప్రజలు చెప్పరాదనీ; ప్రజలు చేయవలసిందల్లా పాలకుల విధానాలకు, చర్యలకు ఎలాంటి మినహాయింపులు లేకుండా మద్దతు తెల్పడం మాత్రమేనని భావిస్తున్నాయి. పాలకులకు మౌలిక మద్దతు అందించడం అన్న చట్రాన్నిదాటి సాగించే ఏ విమర్శ అయినా అది జాతీయప్రయోజనాలకు భిన్నంగా వెళ్లడం అవుతుందనీ, శత్రువు పట్ల మెతగ్గా, సామరస్యంగా వ్యవహరించడంతో సమానమవుతుందనీ పాలకులు భావిస్తున్నారు.

**జాతీయోన్మాదం-అణచివేతలు**

1962, 1965 యుద్ధాల సందర్భంగా కమ్యూనిస్టు నాయకులను, కార్యకర్తలను, ప్రజాతంత్ర వాదులను ముందుగా అరెస్టు చేసి జైళ్లలోపెట్టారు. వారికి వ్యతిరేకంగా ఎలాంటి నిర్దిష్ట ఆరోపణలూ లేవు. ఫలానా పార్టీలు లేదా ఫలానా వ్యకులు చైనాకు అనుకూలంగా, యుద్ధానికి వ్యతిరేకంగా ఉన్నట్లుగా, వారు బయటవుంటే జాతీయ భద్రతకు, శాంతికి ప్రమాదం కావచ్చునని అనుమానిస్తున్నట్లుగా నిఘా విభాగం వారు యిచ్చిన రిపోర్టులను ఆధారం చేసుకొని మాత్రమే పాలకులు ఈ చర్యలకు పాల్పడ్డారు.

యుద్ధానికి ముందూ, యుద్ధ కాలంలోనూ జాతీయత, దేశభక్తి అన్న భావనలను ఒక వున్మాదంగా రెచ్చగొట్టడం పాలకులకూ, వారి అదుపులో వున్న ప్రచార సాధనాలకూ సర్వసాధారణమైంది. తమ దారిలోపడని లేదా పడనట్లుగా అనుమానించిన సంస్థలను, వ్యక్తులను వివిధరకాల వత్తిడులకు, అనుమానాలకు, బెదిరింపులకు గురిచేయడం పాలకులకు పరిపాటైంది. మరీ ప్రత్యేకంగా, యుద్ధ సమయంలో పాలకవర్గాలు అనుసరించే విధానాలను, చర్యలను ప్రశ్నించడాన్ని ఒక పెద్దనేరంగా, జాతీయ వ్యతిరేక చర్యగా వారు చూస్తారు. ప్రజల నోరు మూయడానికి, వారిపై నిర్బంధాలు ప్రయోగించడానికి ఉద్దేశపూర్వకంగానే వారికి వ్యతిరేకంగా వున్మాదాన్ని, భావోద్వేగాలను, విద్వేషాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తారు. ఇలాంటి సమయాల్లో, అల్పసంఖ్యాక మతస్తులను అత్యంత అవమానకరమైన, నిస్సహాయ స్థితిలోకి నెడ్తారు.

1970-71లో, తూర్పు పాకిస్తాన్‌లో ఎన్నికైన ప్రభుత్వం ఆవిర్భవించడం, యాహ్యాఖాన్ నాయకత్వం లోని పాకిస్తాన్ ప్రభుత్వానికి పూర్తిగా సహించలేని విషయంగా పరిణమించింది. అక్కడి ప్రభుత్వం ప్రజలకు వ్యతిరేకంగా హింసాకాండను ప్రయోగించింది. న్యాయంగానే, ప్రజలు పాకిస్తాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిఘటనకు దిగారు. తూర్పుపాకిస్తాన్ ప్రజల ప్రజాతంత్ర పోరాటానికి రాజకీయ, నైతిక మద్దతు, సంఘీభావం అందించడం ఏదేశ ప్రజాతంత్ర శక్తులు చేసినా అది న్యాయబద్ధమే, ఐతే, భారత పాలకవర్గాలు యింకా ముందుకు వెళ్లారు. విముక్తి సైన్యాన్ని సృష్టించి , సాధనసామాగ్రినంతా అందించి, శిక్షణయిచ్చి అంతర్యుద్ధానికి, పాకిస్తాన్ సైన్యానికి వ్యతిరేకంగా పోరాటానికి రంగం సిద్ధం చేశారు. ఒక దశలో భారత సైన్యమే నేరుగా రంగంలోకి దిగింది. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా యుద్ధంలో ప్రవేశించింది. పాకిస్తాన్‌ను ఓడించడంలో, బంగ్లాదేశ్‌ను సృష్టించడంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించింది.

భారతదేశం - శ్రీలంక, నేపాల్ ఆంతరంగిక వ్యవహారాల్లో కల్పించుకొన్న తీరు, యితర దేశాలతో వుండవలసిన సాధారణ సంబంధాల స్వభావానికి భిన్నంగా ఎంతో దూరం వెళ్లింది. ఇది జోక్యందారీ చర్యగా, పెద్దన్న వైఖరిని ప్రదర్శించడంగా వుందని ఆయా దేశాల్లోనూ, ప్రపంచంలోనూ విమర్శల నెదుర్కొన్నది.

ఇక్కడ తలెత్తే ప్రశ్నలు యివి : ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాల్లో మనదేశ పాలకులు జోక్యం చేసుకొనడం సరైందా? మరొక దేశంలోని ఒక ప్రాంతంలో పోరాటం వచ్చినప్పుడు దాని పక్షం వహించడం, ఆ దేశాన్ని చీల్చడానికి సైనిక చర్యను చేపట్టేదాకా వెళ్లడం సరైందా? భారత పాలకవర్గాలు ప్రదర్శించే పెద్దన్న ధోరణులను, జోక్యందారీ, విస్తరణ ధోరణులను, చర్యలను విమర్శించడానికి ఏ భారత పౌరుడు ప్రయత్నించినా అది కొందరికి 'భారతీయతకు, దేశభక్తికి, జాతీయతకు భిన్నంగా' కనిపిస్తుంది. దేశభక్తికి దీన్నే మనం ప్రామాణికతగా అంగీకరించాల్సివస్తే చిన్న, బలహీన దేశాల స్వాతంత్ర్యం, సార్వభౌమాధికారం, భౌగోళిక సమగ్రతలు నిరంతర ప్రమాదాన్నెదుర్కొంటాయి. జాతీయత, దేశభక్తి అన్న భావనలను, ఆచరణలను భారతపాలకవర్గాలు ఏ రీతిలో భ్రష్టుపట్టించారో, దిగజార్చారో యిలాంటి ఆలోచనలు, వాదనలు స్పష్టం చేస్తాయి.

**సామ్రాజ్యవాదానికి దాసోహం**

భారత పాలకవర్గాలు "వలస వ్యతిరేకత" "సామ్రాజ్యవాద వ్యతిరేకత", "స్వతంత్ర విదేశాంగ విధానం" అన్న పదాలను ఉచ్చరించిన కాలం ఒకటుంది. కాని ఈ పదాలను వట్టిమాటలుగా దిగజార్చారు. సామ్రాజ్యవాదానికి దాసోహం అనేదారిలో శరవేగంతో సాగిపోయారు. అమెరికా, రష్యాలు అగ్రరాజ్యాలుగా ప్రపంచంలో ముందుకు వచ్చిన కాలంలో ఒకవైపున మొత్తంగా సామ్రాజ్యవాదానికి లోబడి వుంటూనే, ఏదో ఒక అగ్రరాజ్యం పట్ల మొగ్గు చూపేవారు. తర్వాతి కాలంలో, అమెరికా ప్రపంచాధిపత్య వ్యూహానికి అనుగుణంగా తమ విదేశాంగ విధానాన్ని మలుచుకుంటూ వచ్చారు. అమెరికా నాయకత్వాన ఏర్పడిన అమెరికా-జపాన్-ఆస్ట్రేలియా కూటమిలో భారతదేశం ఒక భాగస్వామిగా చేరడం ఈ క్రమంలో ఒక ప్రాధన్యతగల పరిణామం. యుపిఏ స్థానంలో బిజెపి నేతృత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం రావడం ఈ క్రమాన్ని మరింత వేగవంతం చేసింది. హిందూ మహాసముద్రంలోపలా, ఆసియా- పసిఫిక్ ప్రాంతం లోపలా నౌకాయాన స్వేచ్ఛాహక్కును పరిరక్షించే పనిలో భారతదేశం అమెరికాతో మిలాఖతుకావడం, చైనాపట్ల దాని వ్యతిరేకత (సముద్రాలపైనా, ఈ ప్రాంతాలపైన తన ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు చైనా ఒక బలమైన అవరోధంగా భావించ బడుతున్నది) అన్నవి ఈ కూటమి లక్ష్యాలను ఆచరణలో పెట్టే చర్యలలో ఒక భాగమే. భారత పాలకులు దీని కోసమే తమ ఆర్థిక, రాజకీయ, రక్షణ, వ్యాపార, నిఘారంగాలకు సంబంధించిన విధానాలను, కార్యకలాపాలను మలుచుకొంటున్నారు; సమన్వయం చేస్తున్నారు. ఈ విధానంతో ప్రమాదకరమైన, తీవ్రమైన పర్యవసానాలను భారతదేశం ఎదుర్కోనుంది. ఈ విధానం మూలంగా భారతపాలకులు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో అమెరికా పాల్పడుతున్న జోక్యం, బెదిరింపు, దురాక్రమణ, సాయుధ ఆక్రమణ చర్యలను సమర్థించడమో, నోరుమెదపకుండా వుండడమో చేయక తప్పని అవమానకరస్థితిలో తమను తాము నిలుపు కొన్నారు.

భారతపాలకవర్గాల విదేశాంగ విధానం యొక్క ఈ ధోరణి సామ్రాజ్యవాద సంకెళ్లను తెంచు కొనడానికి, మన దేశాన్ని స్వతంత్రం, శాంతి, ప్రగతి మార్గంలో పెట్టడానికి సుదీర్ఘకాలంపాటు, ఎన్నో వీరోచిత పోరాటాలు సాగించి, మన ప్రజలు నెలకొల్పిన వలసవాద వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫాసిస్టు వ్యతిరేక, శాంతికాముక భావనలను, చైతన్యాన్ని, చారిత్రక సంప్రదాయాలను మొరటుగా త్రోసి పుచ్చుతుంది. మన ప్రజల సానుభూతి, సంఘీభావాలు, అనుబంధం అన్ని వేళలా సామ్రాజ్యవాదుల పీడనల కింద

యింకా నలిగిపోతున్న, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల దోపిడీ బెదిరింపులను, దాదాగిరీని, దురాక్రమణలనూ ఎదుర్కొంటున్న పీడిత జాతుల, ప్రజలవైపు వుంటాయి. మనప్రజలు, స్వాతంత్ర్యాన్ని, శాంతిని కాంక్షించే వారందరూ ఉచ్ఛ స్వరంతో యిలా ప్రకటించాలి : 'సామ్రాజ్యవాదులకు లోబడి వుండడాన్ని అనుమతించబోము, సామ్రాజ్యవాదుల దోపిడీ, పీడన, ఆధిపత్య, యుద్ధ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజల మధ్య, దేశాల మధ్య ఒకటిగా నిలవడమే భారతదేశానికి సరైన స్థానం, దీనికోసం మేము పోరాడుతాము.'

నేటి ప్రపంచంలో గుప్పెడు పెద్ద సామ్రాజ్యవాద దేశాలు(అమెరికా, రష్యాలతో సహా) ఆయుధాలపై గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. ప్రపంచాన్నంతా సర్వనాశనం చేయగల అత్యాధునిక, వినాశకర ఆయుధాలు వీరివద్ద వున్నాయి. ఐనప్పటికీ, యితర దేశాలు మాత్రం తమ స్వీయరక్షణ కోసం కూడా కొన్నిరకాల ఆయుధాలను ఉత్పత్తి చేయరాదని, కలిగివుండరాదని, వుపయోగించరాదని నిషేధిస్తున్నారు. ఈ ఆదేశాలను వుల్లంఘించారనుకొన్న దేశాలను వివిధ రకాల శిక్షలకు గురిచేస్తున్నారు. ఇరాన్, ఉత్తర కొరియాలపైన అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాలు విధించిన ఆర్థిక ఆంక్షలు, ఇరాక్‌కు వ్యతిరేకంగా వారు జరిపిన దురాక్రమణ యుద్ధం, సాయుధ ఆక్రమణ దీనిలో భాగాలే. ఒకవైపున వారు లెక్కలేనన్ని టెర్రరిస్టు గ్రూపులకు ఆర్థిక వనరులను, ఆయుధాలను అందించి తమ అవసరాలకోసం వాడుకొంటున్నారు. మరోవైపున టెర్రరిజానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నామంటూ దేశాలకు వ్యతిరేకంగా దాడులకు, దురాక్రమణలకు దిగుతున్నారు. సారాంశంలో, ఆయుధాలపై తమ గుత్తాధిపత్యాన్ని ఎవరు సవాలు చేసినా అనుమతించేదిలేదని బడా సామ్రాజ్యవాద దేశాలు యిక్కడ స్పష్టం చేస్తున్నాయి. ఈ బడాదేశాల తలబిరుసు చర్యలను భారతపాలక వర్గాలు మౌనంగా చూస్తున్నారు; లేదా సమర్థిస్తున్నారు. ఇది మన ప్రజలకు అవమానకర విషయం; ప్రపంచంలోని చిన్న, బలహీన దేశాల స్వాతంత్ర్యం, శాంతి, భద్రతలకు అత్యంత హానికర విషయం.

భారతదేశాన్ని తమ వ్యూహాత్మక కూటమిలోకి లాగిన అమెరికా సామ్రాజ్యవాదులు – భారత ఆర్థికరంగం, వనరులు, రాజకీయాలు, మిలటరీ, నిఘా, విదేశాంగ విధానాల వ్యవహారాలపైన నిరంతరం పెరుగుతున్న తమ బలమైన పట్టును తమ ఆధిపత్య అవసరాలకోసం వుపయోగించుకొనే అవకాశం ఎంతైనా వున్నది. భారత ప్రజలను– వారికి తెలియకుండా, వారి ఆమోదం లేకుండా, వారికి సంబంధంలేకుండా తమ ప్రపంచాధిపత్య పోటీలో సమిధలుగా వుపయోగించుకొనే అవకాశం కూడా ఎంతైనా వున్నది.

**పాలకుల చేతి పనిముట్టుగా టెర్రరిజం**

భారతదేశంలోని అనేక ప్రాంతాలలో, వివిధ సమయాలలో చిన్నవీ, పెద్దవీ, టెర్రరిస్టుదాడులు అనేకం జరిగాయి. ముంబై వరుసబాంబుప్రేలుళ్లు, ముంబైలో తాజ్‌మహల్ హోటల్‌పై జరిగిన దాడులు, పార్లమెంటు భవనంపై దాడికి జరిగిన ప్రయత్నాలు వీటిలో కొన్ని మాత్రమే. ఈ టెర్రరిస్టు దాడుల రూపకర్తలెవరు? అమలు జరిపిన వారు ఎవరు? వారి లక్ష్యాలు ఏమిటి? లాంటి ప్రశ్నలకు తగిన సమాధానాలు అవసరం అనడంలో సందేహంలేదు. ఐతే, ఈ చర్యలు పూర్తిగా నిందార్హాలు అని చెప్పగలం. అదే సమయంలో మరొక విషయాన్ని కూడా మనం చెప్పాలి. టెర్రరిస్టుదాడులను నివారించడం, ఎదుర్కొనడం అనే పేరిట భారత పాలకులు తీసుకొన్న చర్యలు, టెర్రరిజాన్ని అంతం చేయడానికి మారుగా ప్రజలపైన నిర్బంధాన్ని తీవ్రతరం చేశాయి; ప్రజల మధ్య భయానక వాతావరణాన్ని వ్యాపింపజేశాయి. ఒక మతానికి చెందిన వారిని అనుమానిత లేదా ఆరోపిత టెర్రరిస్టులుగా లేదా వారి మద్దతుదారులుగా అనేక రకాల అవమానాలకు, బాధలకు గురిచేయడాన్ని కూడా చూస్తున్నాము. టెర్రరిస్టులుగా, వారి మద్దతుదారులుగా, అనుమానితులుగా చూడబడిన అమాయక వ్యక్తులు బూటకపు ఎదురు దాడులలో ప్రాణాలు కోల్పోయిన నిదర్శనాలున్నాయి. ఎంతకూ తెగని విచారణల్లో ఏళ్లతరబడి జైళ్లలో మ్రగ్గినవారున్నారు. సరైన న్యాయ సహాయం లేక శిక్షలు పడినవారున్నారు. జీవితంలో విలువైన కాలమంతా హరించుకుపోయిన తర్వాత, ఆర్థికంగా చితికిపోయిన తర్వాత నిర్దోషులుగా ప్రకటించబడినవారున్నారు. అమాయకులైన ఆరోపితులు తమను తప్పుగా కేసులో యిరికించారని అధికారుల ముందు, పోలీసులముందు, కోర్టుల ముందు మొరపెట్టుకొంటే పెడచెవినపెట్టిన సందర్భా లున్నాయి. ఉరిశిక్షలు పడిన వారికి క్షమాభిక్షపెట్టాలని కుటుంబాలవారు, ప్రజాతంత్ర, మానవ హక్కుల సంఘాలవారు భారత అధ్యక్షుడికి, ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తులు కటువుగా తిరస్కరించబడిన సందర్భాలున్నాయి.

కాశ్మీర్‌లో జరుగుతున్న అనేక టెర్రరిస్టు దాడుల వెనుక పాకిస్తాన్ హస్తం, ప్రోత్సాహం వున్నాయని భారతపాలకుల నిరంతర ఆరోపణ, ప్రచారం. భారత ప్రభుత్వగూఢచారి సంస్థలు పాకిస్తాన్‌లో తిరుగుబాటును ఆర్గనైజు చేయడానికి కుట్రలు, ప్రయత్నాలలో మునిగి వున్నాయని, తమ వద్ద తగిన ఆధారాలున్నాయని పాకిస్తాన్ ప్రభుత్వం కూడా తరచుగా ఆరోపణలు చేస్తున్నది. ఈ ఆరోపణలు–ప్రత్యారోపణలు సమస్యకు ఒక ముగింపు చెప్పేప్రయత్నం దాకా వెళ్లవు. రెండు దేశాల పాలకుల మధ్య సంబంధాలు, కొన్ని సమయాల్లో తీవ్రమైన ఉద్రిక్తస్థితిలో వున్నట్లు కనిపిస్తాయి. పరస్పర అపవిశ్వాసాలతో యుద్ధం అంచులకు చేరినట్లుగా కనిపిస్తాయి. కాని హఠాత్తుగా, నాటకీయంగా వారు పరస్పరం విశ్వాసాలు పెంచుకొనవలసిన అవసరం గురించి, సౌభ్రాతృత్వ సంబంధాల గూర్చి, చర్చల ద్వారా సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవలసిన అవసరం గురించి వల్లించడాన్ని చూస్తాము.

కాశ్మీరు లోని అనేక ప్రాంతాలు (ఈశాన్యరాష్ట్రాల్లో కూడా) ఎఎఫ్ఎస్‌పిఎ కింద ప్రత్యేకాధికారాలతో భారతసైన్యం పాలన కింద వున్నాయి. భద్రతా బలగాల చేతుల్లో టెర్రరిస్టులుగా ముద్రపడి లేదా గుర్తించబడిన వేలాది మంది యువకులు హతులయ్యారు. చంపబడిన వారు లేదా అరెస్టుచేయబడిన వారు టెర్రరిస్టులు కాదనీ, అరెస్టుచేసిన వారిని విడుదల చేయాలనీ, మృత దేహాలను తమకు అప్పగించాలనీ వేలాది మంది ప్రజలు నిరసనోద్యమాల్లోకి దిగిన సందర్భాలున్నాయి. కనిపించకుండా పోయిన ఏడువేల మందికి పైగా వ్యక్తులు ఏమయ్యారో చెప్పాలనీ, పేరులేకుండా వున్న 8000 సమాధుల కింద పూడ్చిపెట్టబడిన వారు ఎవరో గుర్తించాలనీ డిమాండు చేస్తూ తల్లిదండ్రులు, మానవ హక్కుల సంఘాలవారు ఈనాటికీ కాశ్మీరులో నిరసనోద్యమం సాగిస్తున్నారు. పంజాబులో బింద్రన్‌వాలా సృష్టివెనుక, ఒక సమయంలో శ్రీలంకలో టెర్రరిస్టు గ్రూపుల వెనుక భారతప్రభుత్వం నిర్వహించిన పాత్ర ఏమిటో అందరికీ తెలిసిందే.

కనుక భారతపాలకవర్గాల వాదనల వెనుక, ప్రచారం వెనుక ఎవరూ కొట్టుకొనిపోవలసిన అవసరం లేదు. నిజానికి 'టెర్రరిజాన్ని' రెండు వైపులా పదునువున్న ఆయుధంగా వారు వుపయోగిస్తున్నారు; వారే దీన్ని సృష్టిస్తారు. తమ ప్రయోజనాలకు, అవసరాలకు వుపయోగపడుతుందనుకొన్నచోట దాన్ని వుపయోగిస్తారు. ప్రజల హక్కులపైన, వారి న్యాయమైన పోరాటాలపైన పాశవిక దాడులను తీవ్రతరం చేయడానికి, నిజమైన సమస్యలనుండి ప్రజలను పక్కదారి పట్టించడానికి 'టెర్రరిస్టు వ్యతిరేక పోరాటం' అన్న మాటలను ఒక ముసుగుగా వారు వుపయోగిస్తున్నారు. తాము అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల నుండి, తత్ఫలితంగా తప్పించుకోలేని పర్యవసానాలుగా ఎదుర్కొంటున్న సంక్షోభాల నుండి, వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి కూడా పాలకవర్గాలు దీన్ని వుపయోగిస్తున్నారు. 'టెర్రరిజం' విషయంలో పాలకవర్గాల నిర్వచనాలను, నిర్ధారణలను, చర్యలను ప్రశ్నించడానికి మన ప్రజలకున్న హక్కును నిరాకరించడం, అలా ప్రశ్నించడాన్ని టెర్రరిస్టు అనుకూల చర్యగా, శిక్షార్హమైన చర్యగా ముద్రవేయడం భారత పాలకవర్గాలకు ఒక అలవాటుగా తయారైంది. దీన్ని అంగీకరించలేము. మన ప్రజల జీవితాలతో చెలగాటం ఆడే హక్కు భారత పాలకవర్గాలకు లేదు.

**మతోన్మాద చర్యలు**

భారతదేశం తమ తమభాషలు, సంస్కృతులు, మత విశ్వాసాలు, జీవనశైలులు, ఆహారపు అలవాట్లు వున్న విభిన్న జాతుల, తెగల, వుపతెగలతో కూడిన దేశం అన్న వాస్తవాన్ని తొలగించడానికి బిజెపి, దాని సంఘపరివార్ శక్తులు చేయాల్సింది అంతా చేస్తున్నారు. వారి హిందూత్వ అవగాహన నిర్దేశించిన వస్త్రధారణ శైలిని, ఆహారపు అలవాట్లను, జీవన శైలులను జనం మీద రుద్దడానికి ప్రయత్నిస్తున్నారు. దీన్ని వ్యతిరేకించిన వారిని, లేదా తమదారిలో పడడానికి నిరాకరిస్తున్నా రనుకొన్న వారిని హెచ్చరిస్తున్నారు. గత రెండేళ్ల కాలంలో హిందూమతోన్మాద శక్తులు అనేక మంది హేతువాదులపైన, ప్రజాతంత్ర, ప్రగతిశీల మేధావుల పైన, సామాజిక కార్యకర్తలపైన ఏవిధంగా దాడులు చేశారో, హత్యలు చేశారో మనం చూశాము, మహారాష్ట్రలో దభోల్కర్, పన్సారేల దారుణ హత్యలు; కర్నాటకలో కల్బుర్గీహత్య, హైదరాబాద్‌లో రోహిత్ వేముల బలవంతపు ఆత్మహత్య–యివన్నీ వీటిలో ఒక భాగమే. ఇంకా యితర అనేకమందిని సంఘపరివార్ శక్తులు అన్నిరకాల అవమానాలకు, బెదిరింపులకు, మానసికహింసలకు, వత్తిడులకు గురిచేశారు. ఇవన్నీ జరుగుతుంటే ప్రభుత్వం ముఖం మరోవైపు తిప్పుకొన్నది; ఈ చర్యలకు నైతిక మద్దతు అందించింది.

భిన్నాభిప్రాయాలపట్ల అసహనం, హింసాత్మక పద్ధతులను ప్రయోగించి, వారి గొంతు నొక్కడానికి ప్రయత్నించడంలాంటి ఫాసిస్టు ధోరణిని మనం చూశాము. ప్లాను ప్రకారమే యిదంతా జరిగింది. సంఘపరివార్ కేంద్రమే దీనికి రచన, దర్శకత్వం వహించింది. హిందూ మతోన్మాదశక్తులు, ప్రభుత్వ పెద్దలు ఎవరిపాత్రను వారు చక్కటి సమన్వయంతో నటించారు. ఈ నాటకంలో, కొందరు నోరువిప్పరు; అనేకులు అడ్డూ అదుపూలేకుండా నోరు పారేసు కొంటారు; కొందరు బెదిరింపులు, హింసాత్మకదాడులు చేస్తారు.; కొందరు ధర్మశాస్త్రాలు, నీతిసూత్రాలు, విలువలు, దేశభక్తి, జాతీయత గూర్చి బోధిస్తారు; కొందరు రాజ్యాంగం, చట్టాలు, నాగరిక ప్రవర్తన గురించి మాట్లాడుతారు. ఐతే, సంఘపరివార్ శక్తులకు దురదృష్టకర విషయం, ప్రజలు ఎంతో ఆహ్వానించదగిన విషయం ఏమంటే – ఈ చర్యలు మేధావుల, ప్రజాతంత్రవాదుల, హేతువాదుల, ప్రగతిశీల, లౌకిక శక్తుల నుండి బలంగా, విస్తృతస్థాయిలో వ్యతిరేకతను, నిరసనను ఎదుర్కొన్నాయి; ఎదుర్కొంటున్నాయి.

భారత పాలకవర్గాలు – జాతీయత, దేశభక్తి అన్న పదాలను తమ అవసరాల కనుగుణ్యంగా సారంలేని డొల్లమాటలుగా దిగజార్చారు.

భారతపాలకవర్గాలు – దేశాన్ని ఘనమైనదేశంగా కీర్తించడాన్ని; పొరుగుదేశాలపట్ల వారి వున్మాదపూరిత, విస్తరణవాద దురాశలను, కార్యకలాపాలను సమర్ధించడాన్ని; సామ్రాజ్యవాదులపట్ల లోబడి వుండే విధానాలను అనుసరిస్తూ, పాలకవర్గాలు సాగించే యుద్ధాలను సమర్ధించడాన్ని; వారి లక్ష్యాలకోసం ప్రాణాలర్పించడాన్ని దేశభక్తిగా, జాతీయతగా చిత్రిస్తారు.

భారతపాలకవర్గాలు – భారతదేశాన్ని ఒకే జాతిగా చిత్రిస్తారు; వివిధ జాతుల హక్కులను, పోరాటాలను నిరాకరించే చర్యలను, అణచివేసే చర్యలను–మన దేశం యొక్క జాతీయ ప్రయోజనాలను, ఐకత్యను కాపాడడానికి వుద్దేశించిన చర్యలుగా చిత్రిస్తారు.

మన దేశ ప్రయోజనాలపట్ల, ప్రజల ప్రయోజనాల పట్ల నిజంగా ఆసక్తివున్న వారందరూ ఒక విషయాన్ని గుర్తించాలి. నేటి ఆధునిక ప్రపంచంలో భారతదేశం లాంటి దేశాల స్వతంత్రమైన, సర్వతోముఖమైన అభివృద్ధికి సామ్రాజ్యవాదం అతిపెద్ద అవరోధంగా వున్నది. సామ్రాజ్యవాదం అన్ని చెడుగులకూ, అభివృద్ధి నిరోధకత్వానికీ, పతన భూయిష్టతకూ పుట్టినిల్లుగా వున్నది. అందువల్ల, ఒకవైపున ఈ వాస్తవాన్ని చూడ నిరాకరిస్తూ, చూడడంలో విఫలమవుతూ జాతీయత గురించి, జాతీయప్రయోజనాల గురించి చెప్పే మాటలన్నీ వ్యర్థమైనవి; మోసపూరితమైనవి. సామ్రాజ్యవాద అవరోధాన్ని దేశంలోనూ, ప్రపంచంలోనూ తొలగించడానికి సాగించే దృఢమైన, నిలకడైన, సమగ్రమైన పోరాటం ద్వారానే మనదేశ ప్రయోజనాలు, ప్రజలప్రయోజనాలు పరిరక్షించ బడతాయి; ముందుకు సాగుతాయి.

భారతదేశం వైవిధ్యపూరితమైన, నిర్దిష్టమైన లక్షణాలు, వారివారి చారిత్రిక అభివృద్ధి క్రమాలు వున్న వివిధ జాతుల సముదాయం అన్న వాస్తవాన్ని మనం గౌరవించాలి. వివిధ జాతులు – సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యం కోసం సాగించే ఉమ్మడి పోరాట క్రమంలో మాత్రమే ఆయా జాతుల ప్రజల మధ్య నిజమైన, చిరకాలం నిలవగల ఐక్యతను నిర్మించి, బలోపేతంచేసి నిలబెట్టగలం. వారు తమ జాతీయ, ప్రజాస్వామిక హక్కులను అనుభవించడానికి తగిన పరిస్థితులను, ప్రజాస్వామిక వాతావరణాన్ని సమకూర్చడం (వాటిని నిరాకరించడం, అణచివేయడం కాదు) ద్వారానే యిది సాధ్యం. జాతుల మధ్య వివక్షలు చూపడం, జాతుల మధ్య అసమాన పరిస్థితులను సృష్టించడం, భారతపాలకవర్గాల వినాశకర విధానం మాదిరిగా ఒకజాతిని మరొకజాతికి వ్యతిరేకంగా నిలబెట్టడం ద్వారా కాదు.

భారతదేశాన్ని హిందూరాజ్యంగా మార్చడానికి జరిగేప్రయత్నాలన్నీ వినాశకరమైనవి; చీలిక స్వభావం గలవి. ఈ ఆలోచనను సిద్ధాంత, రాజకీయ, సాంస్కృతిక, సాంఘిక, ఆచరణ తదితర అన్నిరంగాల్లో వ్యతిరేకించాలి. దానికి వ్యతిరేకంగా సమగ్రంగా, తుదికంటా పోరాడాలి.

మనదేశ శాస్త్రీయ, హేతువాద, ప్రగతిశీల, ప్రజాతంత్ర, లౌకికభావాలు, శక్తులు తాత్విక, శాస్త్రీయ, సాహిత్య, చారిత్రక, సాంస్కృతిక, కళా, సాంకేతిక తదితరరంగాలలో సాధించిన విజయాలు మన పూర్వ తరాలనుండి మన ప్రజలకు వారసత్వంగా లభించిన అత్యంత విలువైన సంపదలు. ఈ సంపదను మనం సగర్వంగా స్వంతంచేసుకోవాలి. చరిత్ర రథచక్రాలను వెనక్కిమళ్లించాలని కృతనిశ్చయంతో పనిచేస్తున్న అభివృద్ధి నిరోధక, ప్రతీప, కాలదోషం పట్టిన శక్తుల దాడులనుండి కంటిపాపల్లా కాపాడుకోవాలి. సాధించిన ఫలితాలను నూతన శిఖరాలకు తీసుకొనివెళ్లాలి.

ప్రజలు దేశ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకోవాలి.

ooooo